# అనుభవం అడుగున అనుభూతి

సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో సూపర్‌మెన్‌ల మానసికాందోళన నివురు గప్పిన నిప్పులాగుంది. ప్రత్యేక గదిలో వాతావరణము ప్రశాంతముగానే ఉంది.

"నేనెక్కడున్నాను?" అరుంధతమ్మ గొంతులోంచి ఆ మాట నీరులేని బావిలోంచి వచ్చినట్టుంది. ఎప్పుడూ రద్దీగా ఉండే కూరగాయల మార్కెట్లో ఠీవిగా నడిచి వెళ్తూ తూలి రోడ్డు ప్రమాదానికి గురై, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో చేరిన రోగి ఆమె. ఆపరేషన్‌కు ముందు శరీరములో ప్రవేశించిన మత్తుమందు ప్రభావం అప్పుడే దిగిపోతోంది. "దొర్సానీ!" అని పిలిపించుకున్న అట్టహాసం ఆ చూపుల్లో లేదిప్పుడు. చిట్టడవిలో ఒంటరి దానిలా అటూ ఇటూ చూస్తోంది. ఆశ్చర్యం ఆవరించింది.

ఆవులిస్తూ కుడికాలుకు వేసున్న పెద్దపట్టీని గమనించి గతుక్కుమంది. లేచి కూచోవాలనీ, నుంచోవాలనీ ఆతృతగా ఉంది. కాని... కదలలేక పోయింది. తన మంచం ముందుండి తననే పరిశీలనగా చూస్తున్న డాక్టర్లు, నర్సుల వైపు దృష్టి మరల్చింది. అయోమయంతో మొహం విచిత్రంగా మారింది.

"మీరిప్పుడు నా నర్సింగ్‌హోంలో ఉన్నారమ్మా!" అంతా గమనించిన డాక్టర్ పెదాల మీద చిరునవ్వు మెరిసింది.

"రోడ్డు ప్రమాదములో మీ కుడికాలు విరిగింది. నేనే ఆపరేషన్ చేసి కట్టు కట్టానమ్మా!"

కుడికాలు పట్టీని అరచేత్తో నిమురుకుంటూ డాక్టర్ సమరేశ్‌ను కిందినుంచి మీద్దాకా చూపులతో తడిమింది. పొంగుకొస్తున్న బాధాతరంగాల నణచి పెట్టుకుంది.

రింగుల జుట్టు, కోలమొహం, సూటు- బూటు, పొడగాటి తెల్లని గౌను, మెడలో స్టెతస్కోపు... డాక్టర్ సమరేశ్ హుషారుగున్నాడు.

"మిమ్మల్ని ఎక్కడో చూసినట్టుంది" ఆందోళన నణచుకుంటూ అడిగింది. డాక్టర్ సమరేశ్ సైగతో నర్సు ముందుకొచ్చి గ్లూకోజ్ బాటిల్ తొలగించింది.

"గుర్తుందామ్మా!" డాక్టర్ సమరేశ్ గంభీరంగా అన్నాడు.

"నా పేరు సమరేశ్. చిన్నప్పుడు మీ ఇంటి ముందున్న చెట్టుకింద ఆడుకునే వాణ్ని".

కాలి బొటనవేలుకు తేలు కుట్టినట్టైందామెకు.

"నువ్వా సమరా!" తపీన అనేసి నాలిక్కరుచుకుంది. 'నువు మా ఊరి పోషయ్య కొడుకువు కదూ!"

"అవునమ్మా!" మా నాన్న చెప్పులు కుట్టేవాడు. మీ వద్ద జీతగానిగా పంజేసేవాడు. మీరు మమ్మల్ని మీ ఇంట్లోకి రానిచ్చేవారు కాదు. గవర్నమెంటు హాస్టల్ల ఉండి చదువుకున్న".

నమ్మలేకపోయింది కాని ఆనాటి సంఘటన మనసు తెర మీద సినిమాలా కదలాడుతోంది....

...కోటి కోర్కెలు కొంగున ముడేసుకుని తానా రోజుల్లో కొత్త కోడలుగా గడీ బంగళాకొచ్చింది. ఓ రోజు పోషయ్య తనకు కొత్త చెప్పులు చేసుకొచ్చాడు. అవి అందంగా ఆకర్షణీయంగా ఉన్నాయి. ఈ మారుమూల పల్లెటూళ్ళో ఇంతటి పనివారున్నారా? ఆశ్చర్యపడింది. మనసులోనే ప్రశంసల జల్లు కురిపించింది. ఆనందాన్ని బయటికి వ్యక్తం చేద్దామంటే ఆభిజాత్యం అడ్డుగా నిలిచింది. ఆశ్చర్యంలోంచి తేరుకునేలోగా ఓ పిల్లవాడొచ్చి తనకు పాద నమస్కారం చేశాడు.

"నువ్వెవరు బాబూ?" ఆప్యాయంగా వీపు నిమిరింది.

"నీ చెప్పులు కుట్టింది మా నాయన పోషయ్య. నా పేరు సమరేశ్" కల్లా కపటం తెలీని ముద్దు మొహం విచ్చుకుంది.

కరెంటు షాక్ తగిలినట్టు దూరం జరిగింది.

"ఛి ఛీ... నువ్వా? అంటరానోడివి గదా! బయటికి నడువ్!" చీదరించుకుంది. లోపలికెళ్ళి తలస్నానం చేసింది. అప్పట్నుంచే పిల్లాడు గడప దాటి లోపలికి రాలేదు. బయట వేపచెట్టు కింద ఆడుకునేవాడు.

... ఆనాటి దృశ్యం ఈనాడు కళ్ళల్లో కదిలింది.

"ఓహో! నువ్వా సమరా? రా బాబూ! ఓసారి నీ చేతులిటివ్వు" ప్రేమగా చేతులు చాచింది.

"ఏమోనమ్మా! మీరు మైలపడి పోతారేమో" టీచర్ ముందు శిశు తరగతి విద్యార్థిలా చేతులు కట్టుకున్నాడు.

అవును. దొరల బంగళాలో పుట్టి పెరిగిన తనకలాగే ఉండేది. మనుషుల్లో అంటరానివారుంటారని, వాళ్ళను దగ్గరికి రానివ్వరాదనే అభిప్రాయం పెద్దల నుండి సంక్రమించింది.

సమరేశ్ పక్కన నుంచున్న తన కొడుకు మీదకు మళ్ళినై చూపులు. అతడు గూడా డాక్టరే. ఆ చూపుల్లోనే అంతరార్థాన్ని పసిగట్టాడు డాక్టర్ కమలాకర్.

"నేను పంజేస్తుంది ఈ హాస్పిటల్లోనేనమ్మా. ఈ సమరేశ్ మా పెద్ద డాక్టర్" ముందుకొచ్చి సమరేశ్ చేతుల్ని తల్లి చేతులకందించాడు.

ఆ చేతుల్ని ఆబగా కళ్ళకద్దుకుంది. ప్రాణానికి హాయిగా, తృప్తిగా ఉందా క్షణం.

"అమ్మా! ఇటు చూడు" డాక్టర్ కమలాకర్ తన పక్కనున్న మనిషిని చూపించాడు" ఈయన నా ఫ్రెండు జగదీశ్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఆక్సిడెంటులో నీ శరీరంలోంచి రక్తం బాగా పోయింది. నీ రక్తం గ్రూపు అరుదైనది. నీకు రక్తమిచ్చి ఆదుకున్నదితడే. ఇతడు డాక్టర్ సమరేశ్ చిన్నమ్మ కొడుకే."

అహంభావం అంతరించి సమభావన చిగురిస్తున్న క్షణాన ఏం మాట్లాడాలో తోచక అరుంధతమ్మ కనురెప్పలు గాల్లో కిటికీ రెక్కల్లా టపటపలాడినై.

ఎవరినైతే అంటరాని వాళ్ళనుకున్నానో, వాళ్ళే ప్రాణాలు కాపాడారు. ఛీఛీ... నిజానికి అంటరానిదాన్ని నేనే! మనుషులంతా మాధవుని అంశలేనని మరిచాను. కుల వ్యవస్థ గురించి ఏ శాస్త్రమూ చెప్పలేదు. మనుషులంతా ఒక్కటే. ఏ తాతల ముత్తాతల కాలములో ఎవరో కావాలని సృష్టించిన భేదభావాలు నాకు సంక్రమించడం దురదృష్టం. ఆదిశంకరాచార్య ఛండాలునికి పాదాభివందనం చేశాడని చదివినా అది నామీద ప్రభావం చూపించలేదు. ఇప్పుడిది ప్రత్యక్ష అనుభవము.... హృదయ పరితాపము పొంగులెత్తి కళ్ళల్లో మంచుతెరల్లా ప్రత్యక్షమైంది.

"బాబూ, ఇలారా!" కళ్ళతో జగదీశ్‌ను పిలిచింది. జగదీశ్ సందిగ్ధంలో పడిపోయాడు. అతని చేతులందుకుని తల్లి చేతులకందించాడు కమలాకర్. జగదీశ్ చేతుల్ని కళ్ళకద్దుకుంది. కన్నీటి బిందువులు జగదీశ్ చేతులకంటి గుండెల్ని కరిగించినై.

"ఇప్పుడు... మీకేమీ అన్పించడం లేదామ్మా?" అడిగాడు ధైర్యంగా. "మీ పేరు అరుంధతమ్మ గదా! అరుంధతి ఎవరో తెలుసామ్మా?" గొంతులో లాలన ఛాయలున్నాయి.

"ఆమె మహా పతివ్రత బాబూ! మనుషులు సృష్టించిన కులానికి తక్కువైనా దేవుడు సృష్టించిన మనుషుల్లోని మహా ఋషికి ఇల్లాలైంది. మహిళా జాతికి మార్గదర్శకమైంది. అన్నీ తెలిసినా నేను చీకట్లోనే ఉన్నానయ్యా! మా ఆయన చనిపోయింతర్వాత నా కొడుకు... ఈ కమలాకర్ నా అభిప్రాయాన్ని మార్చాలని ఎంతో ప్రయత్నించిండు. కాని నేను మారలేదు. నన్ను ముట్టుకోకు నామాల కాకి అనుకుంటూ నేనే ఒంటరినై పోయిన. ఇప్పుడు వెలుగు మీ రూపములో కన్పించింది బాబూ!" మంచానికి చేతులానించి లేవబోయింది.

సమరేశ్, జగదీశ్, కమలాకర్‌లు కలిసి కూచోబెట్టారు. దిండుకు ఒరిగి నిట్టూర్చింది. ముగ్గురి చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని గుండెలకు హత్తుకుని తృప్తిగా నవ్వింది.

మబ్బులు వీడిన ఆకాశంలా మనసు నిర్మలమైంది. తియ్యని అనుభవం, కమ్మని అనుభూతి నిచ్చింది.

*(చేతన - జూలై 2009)*